సమస్యలు పరిష్కరించాలని వినతి



జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డికి పూలమొక్కను అందిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని కలిసిన కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి శనివారం ఆయన కార్యాలయంలో కలిసి సత్కరించి పూలమొక్కను అందించారు. అనంతరం గచ్చిబౌలి డివిజన్‌లోని కాలనీలు ,బస్తీలలో నెలకొన్న సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. గచ్చిబౌలి డివిజన్‌లోని నానక్‌రాంగూడ, గౌలిదొడ్డి, కేశవ నగర్, గోపన్‌పల్లి, నల్లగండ్ల హుడా కాలనీలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, సీసీరోడ్లు, మంచినీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే సాయిఐశ్వర్య కాలనీలో ఉన్న పార్కు స్థలం లో ఓపెన్‌జిమ్, చిల్డ్రన్స్ పార్కు, క్రీడాప్రాంగణం, ప్రహరీగోడ, కేశవనగర్‌లో శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాధాకృష్ణయాదవ్,. హన్మంతునాయక్, తిరుపతి, నర్సింగ్ నాయక్, శేఖర్, రాజు, శ్రీనివాస్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కనువిందు.. నృత్య ప్రదర్శన

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం బెంగుళూరికి చెందిన భరతనాట్య గురువు ప్రతిభ రామస్వామి శిష్యబృందం నృత్య ప్రదర్శన అలరించింది. ఇందులో ఆనందనర్తన గణపతిం, త్రిమూర్తి అంజలి, నటనవాడినల్, దేవీస్తుతి, మహాదేవ కాంచీపురాధీశ్వర, సప్తస్వర, వర్ణం తదితర అంశాలను కళాకారులు అవంతిక, ధన్య, పూజ, సంజన, శ్రావ్యలు ప్రదర్శించారు. కోల్‌కత్తాకు చెందిన ఒడిసి నృత్య కళాకారిణి ఆత్రేయిదత్త ఒడిస్సీ నృత్య ప్రదర్శనలో మంగళచరణ్, మధురాష్టకం మోక్ష అంశాలను ప్రదర్శించారు.

అన్నమయ్యపురంలో..

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం విభావరి డ్యాన్స్ అకాడమీ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనతో అలరించారు. అనంతరం సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ శోభారాజు కళాకారులను అభినందించారు.





చందానగర్ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డు అసంపూర్తిగా ఉన్న దృశ్యం



ప్రమాదకరంగా ఫ్లైఓవర్ ర్యాంపు గుంత

నత్తనడకన ఫ్లైఓవర్ పనులు

చందానగర్ జాతీయ రహదారిపై వాహనాల ట్రా'ఫికర్'



అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్డులో కార్ల పార్కింగ్



రోడ్డు విస్తరణలో అసంపూర్తి నాలా పనులు

- పూర్తి కాని సర్వీస్ రోడ్డు
- రోడ్డు పక్కన వాహనాల పార్కింగ్

హఫీజ్‌పేట్: చందానగర్ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులు నత్తనడకన నడుస్తున్నాయి. దీంతో నిత్యం ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారుల ఇబ్బందులు వర్ణనాతీతం. ఫ్లైఓవర్ నిర్మించేటపుడు రెండు సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఒకవైపు సర్వీస్ రోడ్డు పూర్తి చేశారు. మరోపక్క అసంపూర్తిగా ఉంది. దీనికితోడు ఫ్లైఓవర్ ర్యాంపు కోసం తవ్వి వదిలేసిన రోడ్డు లోతుగా గుంత ఉంది. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఈ గుంతలో వరద నీరు చేరితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రోడ్డు కోసం తవ్విన గుంత పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో ఆలస్యంతో చందానగర్ ప్రధాన రోడ్డుపై ఉన్న వ్యాపార సముదాయాలకు వచ్చే వారు కార్లు, ద్విచక్ర వాహనాలు జాతీయ రహదారి పక్కనే పార్క్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు చలానాలు వేస్తున్నారు.

సమస్యలు ఇవే..

- హైదరాబాద్- ముంబాయి జాతీయ రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతంలో వ్యాపార సముదాయాలు ఉండడంతో షాపింగ్‌కు వచ్చేవారు తమ వాహనాలను రోడ్ల పక్కన ఆపుతున్నారు.
- సర్వీస్ రోడ్డు ఒకవైపు పూర్తి చేశారు. మరో వైపు పూర్తికాకపోవడంతో అక్రమ పార్కింగ్ వల్ల సమస్యలు వస్తున్నాయి.
- చందానగర్-లింగంపల్లి నాలా వరకు ఉన్న షాపులకు వచ్చే వారికి పార్కింగ్ సమస్య వస్తోంది.
- ఉదయం, సాయంత్రం వాహనాల రద్దీ పెరగడంతో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి.
- సర్వీస్ రోడ్డుపైనే వాహనాలు నిలపడం వలన తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి.
- జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ పనులు జరుగుతున్నాయనే సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- జాతీయ రహదారిపై దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సర్వీస్ రోడ్డు పూర్తి చేయాలి



చందానగర్ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్‌కు ఇరువైపులా సర్వీస్ రోడ్డు నిర్మించాలి. కానీ ఒకవైపు నిర్మించి మరోవైపు వదిలేశారు. వెంటనే అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్డు పనులు ప్రారంభించాలి.
–రామకృష్ణ గౌడ్, చందానగర్

చలానాలు వేస్తున్నాం



జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో సర్వీస్ రోడ్డుపై వాహనాలు నిలిపిన వారికి చలానాలను విధిస్తున్నాం. ట్రాఫిక్ జామ్‌లు కాకుండా వాహనాలు రోడ్డుపై పార్కింగ్ చేయొద్దని కోరుతున్నాం. అంతే కాకుండా రాంగ్ రూట్‌లో వస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నాం.
–పవన్‌కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, ఆర్సీపురం

అపర్ణ గ్రాండేలో గూంజ్



అపర్ణ గ్రాండేలో దుస్తులు, ఆట వస్తువులను అందజేస్తున్న నివాసితులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్ల అపర్ణ గ్రాండేలో శనివారం గూంజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అపర్ణ గ్రాండేలో నివాసం ఉండే వారు దుస్తులు, చిన్నారుల ఆటబొమ్మలు, ఇతర వస్తువులను నిర్వాహకులకు అందజేస్తారు. పేదలు, లేదా అవసరమైన వారికి నిర్వాహకులు వీటిని అందజేస్తారు. ఈ కార్యక్రమాన్ని ఏడాదిలో రెండు సార్లు నిర్వహిస్తారని గ్రాండే వాసులు తెలిపారు.

రక్తదాన శిబిరం



హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడలోని మేరు ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథులుగా అజయ్ మిశ్రా, డాక్టర్ కె.పిచ్చిరెడ్డిలు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానమన్నారు. పాఠశాల వ్యవస్థాపకురాలు మేఘన రక్తదానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో 100 మంది పాల్గొని రక్తదానం చేశారు.

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి



సురక్ష ఎన్‌క్లేవ్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలోని చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని సురక్ష ఎన్‌క్లేవ్‌లో సుమారు రూ.20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పదవీ విరమణ సత్కారం



నరేందర్‌రెడ్డి, జలంధర్‌రెడ్డిలను సన్మానించిన జెడీసీలు ఉపేందర్ రెడ్డి, వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, డీసీ రజనీకాంత్‌రెడ్డి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో పదవీ విరమణ చేసిన అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ పి.నరేందర్‌రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ కె.జలంధర్ రెడ్డిలను ఘనంగా సన్మానించారు. శనివారం శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు ఉపేందర్ రెడ్డి, వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డిలు వారిని సన్మానించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ పదవీ విరమణ సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ మల్లికార్జున్, ఏసీపీలు నరేందర్‌రెడ్డి, మెహ్రా, ఈఈ శ్రీనివాస్, గుల్‌మొహర్‌పార్కు కాలనీ అధ్యక్షులు షేక్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

టీహబ్‌లో టచ్ ఏ లైఫ్ వార్షికోత్సవం



రాయదుర్గం: స్పర్శ అనేది సంఘటన కాదని, ఇది పరివర్తన శక్తికి నిదర్శనమని టచ్ ఏ లైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు విభూతిజైన్, రినాహిందోచా వెల్లడించారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో టచ్ ఏ లైఫ్ స్పర్శ పేరిట పదో వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ దాతలు, ప్రముఖులను ఒకచోట చేర్చి బాలికల విద్యను ప్రోత్సహించడంలో ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. బాలికలకు సాధికారత కల్పించడం ద్వారా సంఘానికి ఉజ్వల భవిష్యత్తును సృష్టించే ఒక స్పార్క్‌ను వెలిగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీహబ్ సీఈఓ శ్రీనివాసరావు మహంకాళి, మైరాన్ హోమ్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అశ్రిత వేముగంటి, కిస్టోన్ స్కూల్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ శ్రీలక్ష్మీరెడ్డి, శ్రీనివాస్ తీర్థాల, మహ్మద్ ఖలీకర్ రహమాన్, జ్యోతిచంద్ర, సంస్థ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్పలో చర్చి ప్రారంభం

శేరిలింగంపల్లి: క్రైస్తవుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తామని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని రాజీవ్ గృహకల్ప బ్లాక్-22 వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన క్రీస్తు సంఘం చర్చిని ఆయన శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానికులు మెషిక్, మూర్తి ,చిట్టిబాబు, సతీష్, జమ్మయ్య, మహేష్, జమమ్మ తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



బాధిత కుటుంబ సభ్యునికి మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డుకు చెందిన వెంకట నరేష్‌కు వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన సీఎంఆర్ఎఫ్ నిధులు 55 వేలు మంజూరు పత్రాలను శనివారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మాదాపూర్ డివిజన్ బీఆర్‌యస్ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నిజాంపేట్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్ అన్నారు. శనివారం నిజాంపేట్ 7వ డివిజన్‌లోని రెడ్డీస్ ఎవెన్యూ 2సీలో రూ.16 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ ప్రణయయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రెడ్డీస్ ఎవెన్యూ 1ఏ, 2బీ, 1సీ లలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను స్థానికులు డిప్యూటీ మేయర్ దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ఆయన వెంట మున్సిపల్ ఇంజనీర్ అరుణ్, అసోసియేషన్ ప్రెసిడెంట్ గురునాథ్, జనరల్ సెక్రెటరీ చుక్క సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ ధనంజయ్, ట్రెజరర్ మురళి, జగన్‌మోహన్ తదితరులు ఉన్నారు.

బస్తీల్లో మెరుగైన వసతుల కల్పనే లక్ష్యం

గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: ప్రజలకు మెరుగైన వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డి, కేశవనగర్ బస్తీలలో ఆయన శనివారం పర్యటించారు. ఆయా బస్తీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు ఫోన్ ద్వారా సమస్యలను వివరించి పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంచినీటి పైప్‌లైన్‌ల నిర్మాణం, శ్మశానవాటికల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హన్మంతునాయక్, తిరుపతి, కిషన్, భిక్షపతి, ఈశ్వర్, సునీల్, కృష్ణ, నర్సింగ్‌నాయక్, శేఖర్, రమేష్, సురేష్, ప్రసాద్, బాబు పాల్గొన్నారు.



కేశవనగర్‌లో పర్యటించిన కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

పుస్తకాల పంపిణీ

రామచంద్రాపురం (పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని మండల ప్రాథమిక పాఠశాలలో బీఎస్పీ నాయకులు సుంకు వినయ్ కుమార్, రాధిక దంపతులు శనివారం విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను వారు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు.కార్యక్రమంలో నాయకులు బీఎస్పీ శ్రీశైలం, జనార్దన్, దశరథ్, రాజేందర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ పరిధిలోని ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని శనివారం కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులకు రూ.2 కోట్లతో ప్రతిపాదనలు చేయడం జరిగిందని తెలిపారు. భారతీనగర్ డివిజన్ పరిధిలోని పోచమ్మ ఆలయం పక్కన నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అదనంగా రూ.95 లక్షల నిధులు మంజూరు చేయాలని జోనల్ కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. అందుకు జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆదర్శరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం



సమావేశంలో మాట్లాడుతున్న జెడీసీ ఉపేందర్‌రెడ్డి

- భూసేకరణను వేగవంతం చేయాలి
- జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

గచ్చిబౌలి: అనుమతులు లేకుండా చేపట్టే నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాలని శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో జెడీసీ శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ అనుమతులను ప్రభుత్వం సులభతరం చేసిందని, నిర్మాణదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రహదారి విస్తరణ, భూసేకరణ ,జంక్షన్ల సుందరీకరణ, భవన నిర్మాణ అనుమతుల అంశాలపరంగా ఆయన అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐటీ పరిశ్రమలకు వేదికగా ప్రాంతంలో నానాటికి వాహనాల వినియోగం పెరుగుతున్నందున అందుకు అనుగుణంగా రహదారుల విస్తరణను ప్రాధాన్యతగా చేపట్టాలన్నారు. ప్రభుత్వం కల్పించిన టీడీఆర్ వెసులుబాటును యజమానులకు వివరించాలన్నారు. సీపీ మల్లికార్జున్, ఏసీపీ సురేందర్‌రెడ్డి, ఇతర ఏసీపీలు, న్యాక్ ఇంజనీర్లు, ఏసీపీలు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ వెస్ట్ జోన్ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగం, పారిశుద్ధ్యం, బయోడైవర్శిటీ విభాగాల అధికారులతో కలిసి ఆయన మాదాపూర్‌లోని ఏపీ బస్టాపు, హఫీజ్‌పేట్ తుమ్మిడికుంట చెరువు, కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయం, కొత్తగూడ అండర్‌పాస్, మియాపూర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రోడ్డు, నడిగడ్డతండా ప్రాంతాలలో ఆయన శనివారం పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో అధికారులంతా క్షేత్రస్థాయిలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద నీటి ప్రవాహానికి కీలకమైన నాలాలు ఎక్కడ ఆక్రమణలకు గురయినా ఉపేక్షించవద్దని, తక్షణమే కూల్చివేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎస్‌ఈ శంకర్, ఈఈ రాజు, ఏసీపీ రాజ్‌కుమార్, ఈఈ మల్లికార్జున్, డాక్టర్ కార్తీక్, డీఈ స్రవంతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

3 నుంచి ఉర్సు ఉత్సవాలు

ముస్తాబైన బాగ్దాదీ దర్గా

లంగర్‌హౌస్: చారిత్రాత్మక దర్గా ఉర్సు-ఇ-షరీఫ్ ఉత్సవాలకు ముస్తాబయ్యింది. జులై 3వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సంవత్సరం కూడా వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు. ప్రధాన సందల్ సమర్పణ 4న అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. కాగా ఈ ఉత్సవాలకు రాష్ట్రం నుంచే కాకుండా చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇప్పటికే ఇక్కడికి చేరుకుంటుండటంతో పండగ వాతావరణం నెలకొంది. మంత్రులు, ప్రముఖులు కూడా దర్గాను దర్శించి మొక్కులు తీర్చుకోనున్నారు.

బావి నీటి మహిమ..

కుతుబ్‌షాహీల కాలంలో నిర్మించిన ఈ దర్గా ద్వారాన్ని ఆనుకొని పురాతన బావి ఉంది. ఈ బావి నీటిని 5 శుక్రవారాలు తాగడంతో బాటు ఈ నీటితో 5 శుక్రవారాలు స్నానం చేసి దర్గాను దర్శిస్తే భయంకర రోగాలు సైతం దూరమవుతాయని భక్తుల నమ్మకం. ముస్లింలతో పాటు హిందువులు, సిక్కులు వివిధ మతస్తులు ఈ ఉర్సు ఉత్సవాల్లో పాల్గొంటారు. దర్గా నిర్వాహకులు ప్రధాన మోతవలి ఆధ్వర్యంలో ముఖ్య టుర్బట్ షరీఫ్‌లో, పరిసర ప్రాంతాల్లో ఘుల్-ఇ-షరీఫ్ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా దర్గాను సుగంధ ద్రవ్యాలతో శుభ్రపరుస్తారు.



ఉర్సు ఉత్సవాలకు ముస్తాబయిన దర్గా

ప్రధాన కార్యక్రమాలు..

జులై 3న దర్గా ఉర్సు-ఇ-షరీఫ్ ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. మొదటి రోజు సాయంత్రం 6:30 గంటల నుంచి ప్రధాన దర్గాలో ఘుస్ల్-ఇ-షరీఫ్, సుగంధ ద్రవ్యాలతో దర్గా శుద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 4వ తేదీ సాయంత్రం ప్రధాన ఘట్టం ప్రారంభమవుతుంది. కార్వాన్‌లోని సజ్జద్-ఇ-నషీన్ గృహం నుంచి పవిత్ర సందల్‌ను భారీ ర్యాలీలు, ఆటపాటలతో ఊరేగింపుగా లంగర్ హౌస్ దర్గాకు తీసుకొచ్చి ప్రధాన దర్గాలో సందల్ సమర్పించనున్నారు. 5వ తేదీ ఉర్సు చిరాగహన్ కార్యక్రమం నిర్వహించనున్నారు. మీలద్ అనంతరం ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమాలు పెద్దయెత్తున నిర్వహించనున్నారు. రాత్రంతా జాగరణ, పంఖస్ మరియు ఫిలాఫ్-ఇ-ముబారక్ కార్యక్రమాలు ఉంటాయి. 6వ తేదీన ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.



దర్గా ప్రాంగణంలో బావి

ప్రత్యేక బస్సులు..

ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లుగా ఈ సంవత్సరం కూడా ఉత్సవాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుందని నిర్వాహకులు తెలిపారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ ఆర్టీసీ బస్సుల కోసం సంబంధిత అధికారులతో మాట్లాడారు. పాతబస్తీతో పాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

ఉచిత వైద్యశిబిరం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో శనివారం తెల్లాపూర్ నైబర్‌హుడ్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శిబిరంలో సుమారు వందమంది కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

బస్సు సౌకర్యం కల్పించండి

జిన్నారం(పటాన్‌చెరు): ఖాజీపల్లి గ్రామానికి బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ ఖాజీపల్లి కాలుష్య నివారణ జేఏసీ కమిటీ నాయకులు శనివారం సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. జేఏసీ చైర్మన్ దండె రమాకాంత్ ఆధ్వర్యంలో మంత్రిని కలిసి విన్నవించగా ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చినట్లు రమాకాంత్ తెలిపారు. అనంతరం కాలుష్య సమస్యపై పీసీడీ ఎంఎస్‌కు వినతిపత్రాన్ని అందించారు.

బోనాల పండగ ఏర్పాట్లపై సమావేశం



పటాన్‌చెరు టౌన్: బోనాల పండగ నేపథ్యంలో పటాన్‌చెరు జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో విద్యుత్‌శాఖ అధికారులతో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ పండుగ ఏర్పాట్లపై శనివారం సమావేశం నిర్వహించారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఆలయాల వద్ద పారిశుద్ధ్య పనులతో పాటు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. ఫలహారం బండి ఊరేగింపు సమయంలో విద్యుత్ సమస్య లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్‌కుమార్, నికిత పాల్గొన్నారు.